
సాక్షి గుంటూరు

గురువారం । 9 । మే । 2024



ఎమ్మెల్యే ఆర్కే వాహనం తనిఖీ

మంగళగిరి: మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వాహనాన్ని పోలీసులు బుధవారం కాజ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.90 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3000, గరిష్ట ధర రూ.5500, మోడల్ ధర రూ.4200 వరకు పలికింది.

న్యూస్‌రీల్

ఉద్యోగుల ఫ్రెండ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్



నెహ్రూనగర్: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రభుత్వ ఉద్యోగుల స్థితిగతుల్లో సమూల మార్పులు వచ్చినట్లు ఏసీ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పోలే ముత్యం, రెడ్డి కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కంజుల సత్యనారాయణ రెడ్డి, వైఎసార్ సీపీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాదిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంపాలెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా ఉద్యోగుల ప్రయోజనాలకు కట్టుబడిన దాఖలాలు లేవని వారు స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడడమే కాకుండా సమర్థులైన ఉద్యోగులకు సరైన గుర్తింపు, సముచిత గౌరవం కల్పించడంలో ముఖ్యమంత్రి జగన్ ఎప్పుడూ ఒకడుగు ముందే ఉంటారని పేర్కొన్నారు.

పోలైన 5076 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు



గుంటూరు వెస్ట్: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో బుధవారం జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది, జర్నలిస్టులు, అత్యవసర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటింగ్ మొత్తం ప్రశాంతంగా జరిగింది. ఈక్రమంలో తాడికొండలో 462, మంగళగిరిలో 1088, పొన్నూరు 426, తెనాలి 442, ప్రత్తిపాడు 394, గుంటూరు పశ్చిమ 1595, గుంటూరు తూర్పు 669.. మొత్తం 5076 ఓట్లు పోలయ్యాయి.

యార్డులో 70,776 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 57,850 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 70,776 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,624 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

పాస్టర్లకు డిగ్రీ పట్టాలు అందజేత



గుంటూరు మెడికల్: కౌన్సిల్ ఆఫ్ రీఫార్మ్‌డ్ చర్చెస్ ఆఫ్ ఇండియా, వైజాగ్ వారు మంగళవారం స్థానిక గాంధీనగర్ పవర్ గాస్పల్ మినిస్ట్రీస్‌లో రెవ.పి.వరప్రసాద్ ఆధ్వర్యంలో దైవసేవకులకు పట్టాలు అందజేశారు. వేదాంత విద్యలో భాగంగా సర్టిఫికెట్స్, వివాహ పట్టాలు 20 మంది పాస్టర్లకు అందజేశారు. ఆర్చ్ బిషప్ జి.విజయరాజు, బిషప్స్ నతానియేలు, దేశిరాజు, పాస్టర్లు, ఇవాంజిలిస్టులు, బైబిల్ ఉమెన్స్, స్థానిక సంఘ విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు. పట్టాల అందజేత అనంతరం అభిషక్తులకు సన్మానం చేశారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై టీడీపీ దుష్ప్రచారం



కొరిటెపాడు(గుంటూరు): టీడీపీ నేత చంద్రబాబునాయుడుకు ఓటమి భయం పట్టుకుందని గిరిజన ప్రజా సమాఖ్య(జీపీఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో మన భూములకు మరింత రక్షణ ఉంటుందన్నారు. భావితరాలకు వివాద రహిత భూమిని అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు.

ప్రచార పర్వం



వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ చేబ్రోలు మండలం మంచాల, తోట్లపాలెం, శ్రీరంగపురం గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామగ్రామాన ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఫ్యాను గుర్తుకు ఓటేయాలని ఆయన అభ్యర్థించారు. - చేబ్రోలు



దుగ్గిరాల మండలం చింతలపూడి, డీపీ అగ్రహారం, పెనుమూలి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య ప్రచారం నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. - తాడేపల్లిరూరల్



ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 48వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దారిపొడవునా ప్రజలు సాదర స్వాగతం పలికారు. ఐదేళ్ల మేలు మళ్లీ కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని బలసాని కోరారు. - గుంటూరు రూరల్

మా ఊర్లోకి రావొద్దు..
మా ఓటు ఫ్యాన్ కే

- పెదనందిపాడు మండలం జీజీపాలెంలో ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుకు చేదు అనుభవం
- కార్లతో ఊరేగింపుగా ఊర్లోకి రావొద్దన్న మహిళలు
- ప్రచారానికి స్పందన శూన్యం
- నివ్వెరపోయిన 'బూర్ల'



మేం మీకు ఓటు వెయ్యం అంటూ రామాంజనేయులుకు తెగేసి చెబుతున్న జీజీపాలెం గ్రామస్తులు

ప్రత్తిపాడు: టీడీపీ ప్రత్తిపాడు అభ్యర్థి బూర్ల రామాంజనేయులుకు చేదు అనుభవం ఎదురయ్యింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి బూర్ల పెదనందిపాడు మండలం గొరిజవోలుగుంటపాలెం (జీజీపాలెం)లో పర్యటించారు. గ్రామంలో తిరుగుతూ సైకిల్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. దీంతో స్థానికులు.. మీకు, మీ పార్టీకి ఎందుకు ఓటెయ్యాలి? మీకు వెయ్యం.. మేము ఫ్యాన్ గుర్తుకే ఓటేస్తాం అంటూ మొఖం మీదనే ఖరాఖండీగా తేల్చి చెప్పారు. ఊహించని పరిణామంతో ఖంగుతిన్న బూర్ల రామాంజనేయులు ఓకే.. ఓకే.. అంటూ అక్కడి నుంచి చిత్తగించేశారు. ఇదిలా ఉంటే బూర్ల గ్రామంలో పర్యటిస్తున్నప్పటికీ జనం బయటకు రావడం గానీ, బయట బల్లలపైనా, చప్టాల పైనా ఉన్నవారు కనీసం చేతులు ఊపడం గానీ చెయ్యకపోవడం, గ్రామస్తుల నుంచి కనీస స్పందన లేకపోవడంతో బూర్లకు పరువుపోయినంత పనయ్యింది.

కార్లతో హంగామాగా రావొద్దంటూ..

పెదనందిపాడు మండలంలో జీజీపాలెం వైఎస్సార్ సీపీకి కంచుకోట. అలాంటి గ్రామంలో అలజడి సృష్టించేందుకు బూర్ల రామాంజనేయులు బుధవారం రాత్రి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి పూనుకున్నారు. ఓ ఆరేడు కార్లుతో నానా హంగామాగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణతో కలిసి గ్రామంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, మహిళలు కాన్వాయ్ వద్దకు చేరుకుని, ఇంత హంగూ ఆర్భాటాలతో ఇన్నిన్ని కార్లుతో ఊరేగింపుగా గ్రామంలోనికి వద్దన్నారు. కావాలంటే నడిచి వెళ్లి మీ ప్రచారం మీరు చేసుకోవాలని సూచించారు. దీంతో నివ్వెరపోయిన బూర్ల రామాంజనేయులు కారు దిగి కొద్దిదూరం నడుచుకుంటూ గ్రామంలోనికి వెళ్లాల్సి వచ్చింది. ఇంతలో పెదనందిపాడు పోలీసులు అక్కడకు చేరుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తమయ్యారు.

కమలాన్ని తొక్కేస్తున్న సైకిల్

- ప్రధాని రోడ్‌షో సమయంలో మంగళగిరిలో టీడీపీ నేతల ప్రచారం
- టీడీపీ నేతలపై మండిపడుతున్న కమలనాథులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్డీఏ గెలుపు కోసం సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం విజయవాడలో రోడ్ షోకు హాజరయ్యారు. ఈ రోడ్‌షోను విజయవంతం చేయడం కోసం ఎన్టీఆర్ జిల్లాతో పాటు పక్కనే ఉన్న గుంటూరు జిల్లా నుంచి కూడా ప్రజలను తరలించాలని నిర్ణయించారు. అయితే తెలుగుదేశం నాయకులు మాత్రం మిత్ర ధర్మాన్ని పక్కనపెట్టి పక్కనే ఉన్న మంగళగిరిలో ప్రచార కార్యక్రమాలు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తనయుడు లోకేష్ మంగళగిరి అభ్యర్థిగా పోటీలో ఉండటంతో తెలుగుదేశం నేతలు మోదీ కార్యక్రమానికి డుమ్మా కొట్టి మంగళగిరిలో వరుసగా ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో కమలనాథులు మిత్ర ధర్మం పాటించని టీడీపీ నేతలపై మండిపడుతున్నారు.

❖ మంగళగిరి నియోజకవర్గంలో బుధవారం టీడీపీ మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నారాలోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి, గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లు చేనేత కార్మికులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. మంగళగిరిలోని పలు డివిజన్‌లలో పర్యటనతోపాటు, కాజా, చినకాకాని, ఆత్మకూరు, గ్రామాల్లో కూడా టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇదంతా మోదీ రోడ్‌షో చేసే సమయంలోనే కావడం విశేషం. ఈ విషయాన్ని బీజేపీ నేతలు వాట్సాప్ గ్రూపుల ద్వారా సర్క్యులేట్ చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ మిత్ర ద్రోహానికి పాల్పడుతోందని వారికి తగిన బుద్ధి చెప్పాలంటూ తమ సొంత గ్రూపుల్లో మెసేజులు పెడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రచార కార్యక్రమాలకు కేవలం జనసేన, తెలుగుదేశం జెండాలు మాత్రమే ప్రదర్శిస్తూ బీజేపీ జెండాలు పక్కన పడేయడంపై బీజేపీ నేతలు గుర్రుగా ఉన్నారు. మరోపక్క ప్రచార కార్యక్రమాలకు సైతం బీజేపీ నేతలను ఆహ్వానించకుండా అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమందిని ప్రచారాలకు పిలిచినా కేవలం ఉత్సవ విగ్రహాల మాదిరిగా బీజేపీ నేతలను కూర్చొబెడుతున్నారు తప్పితే ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదంటున్నారు.

ఎన్నికల్లో కాపుల సత్తా చూపిద్దాం

కాపు అభ్యర్థులను గెలిపించుకుందాం

- కాపుల ఆత్మీయ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం
- సీఎం జగన్ పాలనలోనే కాపులకు గుర్తింపు
- టీడీపీ కాపులను ఓటు బ్యాంకుగానే చూస్తోంది
- కాపులను అణగదొక్కడమే టీడీపీ లక్ష్యం

పెదకాకాని: సామాజిక వర్గం అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని కాపుల సత్తా నిరూపించుకోవాలని ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పెదకాకాని శివారులోని ఎస్.కన్వెన్షన్‌లో బుధవారం రాత్రి పెదకాకాని మండలం కాపు సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాపు సంఘం నాయకుడు మాదా రాధాకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కాపులకు మంచి గుర్తింపు, గౌరవం దక్కిందన్నారు. కాపుల జనాభా లెక్క ప్రకారం రాజ్యాధికారం దిశగా ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని భగవంతుడు ఇచ్చిన మంచి ఆలోచనలతో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు.

21 సీట్లతో రాజ్యాధికారం వస్తుందా..?
: అంబటి మురళీకృష్ణ

టీడీపీ పవన్ కల్యాణ్ కు కేటాయించిన 21 సీట్లతో రాజ్యాధికారం వస్తుందా అని వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. పొన్నూరు వచ్చిన సమయంలో పవన్ కల్యాణ్ అంబటి మురళీకృష్ణకు, కిలారి వెంకట రోశయ్య ఓటు వేయొద్దని చెప్పలేదని, అయితే టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు ఎంపీ సీటు, పొన్నూరు ఎమ్మెల్యే సీట్లు కాపులకు కేటాయిస్తే కాపులు ఓడించాలని చెప్పడం న్యాయమా అన్నారు. కాపు సంఘం నాయకులు వాసా మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాసరావు ఆకుల వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి శివశంకర్‌రావు, తోట శ్రీనివాసరావు, నడింపల్లి కోటేశ్వరమ్మ, దంతాల శివ పార్వతి, బందెల ఉదయ శంకర్, బొలిశెట్టి విజయ్ కుమార్, అల్లా వెంకట్రావు, బెజవాడ శివయ్య, ఆలపాటి రాఘవ, తోటకూర వెంకటేశ్వరావు, గుమ్మడి వెంకట్రావు, కానుగోలు శంకర్‌రావు, పల్లంపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలోనే పవన్ కల్యాణ్‌కు వెన్నుపోటు
: చందు సాంబశివరావు

ఆదిలోనే టీడీపీ సీట్లు కేటాయించే విషయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను వెన్నుపోటు పొడిచిందన్నారు. జనసేనకు 30 సీట్లు 40 సీట్లు ఇస్తామని చెప్పి 21 సీట్లు కేటాయిస్తే కాపులకు రాజ్యాధికారం వస్తుందా ముమ్మాటికీ కాపులను అణగదొక్కటమే అన్నారు. ప్రజాభిమానం మెండుగా ఉన్న పవన్ కల్యాణ్‌ను రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి జన సమీకరణ అవసరం లేకుండా ఉపయోగపడతాడని ఒక వ్యూహం ప్రకారమే టీడీపీ వాడుకుంటుందన్నారు. జనసేనకి ఇచ్చిన 21 సీట్లతో పవన్ కల్యాణ్ రాజ్యాధికారం సాధించేది లేదు, కాపులకు మేలు జరిగేది లేదని స్పష్టం చేశారు.

కాపులను వెన్నుపోటు పొడిచిన టీడీపీ

డాక్టర్ టీవీ రావు



కాపులను రాజకీయంగా ఎదగనీయకుండా వెన్నుపోటు పొడుస్తున్న టీడీపీకి కాపు సోదరులందరూ బుద్ధి చెప్పాలని డాక్టర్ టీవీ రావు అన్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో కాపులకు వైఎస్సార్ సీపీ 31 ఎమ్మెల్యే టికెట్లు, 5 ఎంపీ టికెట్లు కేటాయిస్తే టీడీపీ కాపుల్లో పోటీ చేసే అభ్యర్థులు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. గుంటూరు జిల్లాలో జనసేన పార్టీ నుంచి పోటీ చేసే అర్హత ఉన్న కాపులే కనిపించలేదా అని ప్రశ్నించారు. ఎక్కువ ఓట్లు కలిగిన కాపు సామాజిక వర్గానికి తక్కువ సీట్లు, తక్కువ ఓట్లు కలిగిన కమ్మ సామాజిక వర్గానికి ఎక్కువ సీట్లు ఇస్తూ కాపులను కేవలం ఓటు బ్యాంకుగా టీడీపీ వాడుకుంటుందన్నారు. కాపు అభ్యర్థుల గెలుపే మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, వేదికపై ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి, కాపు నాయకులు

బీసీల పార్టీ వైఎస్సార్ సీపీ



కృష్ణ జపం చేస్తున్న మంత్రి విడదల రజిని, ఎంపీ అభ్యర్థి కిలారి, ఎంపీలు ఆర్.కృష్ణయ్య, బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, ఏసురత్నం, ఎమ్మెల్యే గిరి

బీసీల సంక్షేమానికి రూ.1.85 లక్షల కోట్లు

- ఈ ఐదేళ్లలో జగనన్న చేసిన ఖర్చు ఇది
- 50 శాతం సీట్లు బీసీలకే ఇచ్చిన ఘనత జగనన్నది
- యాదవ సామాజికవర్గానికి ఎంతో మేలు చేసిన ప్రభుత్వం మాది
- శ్రీవారి గర్భగుడి తలుపులు సన్నిధి గొల్లలే తెరిచేలా జీఓ తెచ్చాం
- నరసరావుపేట, ఏలూరు లాంటి కీలక పార్లమెంటు టికెట్లు యాదవులకే ఇవ్వడం ఒక చరిత్ర
- టీడీపీలో యాదవులు అంటే కేవలం యనమల కుటుంబసభ్యులే
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరులో భారీస్థాయిలో యాదవుల ఆత్మీయ సమావేశం

నెహ్రూనగర్: బీసీల సంక్షేమానికి ఐదేళ్ల కాలంలో ఏకంగా రూ.2లక్షల కోట్లు ఖర్చు చేసిన గొప్ప నేత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి విడదల రజిని తెలిపారు. స్థానిక కొరిటెపాడులోని కొమ్మినేని గార్డెన్స్‌లో మంగళవారం యాదవులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో బీసీ సంక్షేమం కోసం జగనన్న ఎంతో చేశారని తెలిపారు. డీబీటీ ద్వారా ఏకంగా రూ.1.3 లక్షల కోట్లు, నాన్ డీబీటీ ద్వారా ఏకంగా రూ.55వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మొత్తం రూ.1.85 లక్షల కోట్ల రూపాయల లబ్ధి ఈ ఐదేళ్ల కాలంలో మన రాష్ట్రంలో ఒక్క బీసీలకే చేకూరిందని చెప్పారు.

కీలక సీట్లు యాదవ సోదరులకు...

మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాజకీయంగా జగనన్న యాదవ సామాజికవర్గానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. నరసరావుపేట, ఏలూరులాంటి లోక్‌సభ సీట్లను యాదవులకే జగనన్న కేటాయించారని తెలిపారు. ఈ రెండు లోక్ సభస్థానాలు ఎంతో కీలకమైనవని, రాజకీయ ప్రాబల్యం బాగా ఉండే కులాలు మాత్రమే ఇక్కడ ఇప్పటివరకు గెలుస్తూ వచ్చాయని వివరించారు. ఇలాంటి చోట్ల యాదవులకు సీట్లు ఇవ్వడం అంటే అది సాహసమని, ఆ సాహసాన్ని చేసిన నాయకుడు జగనన్న అని పేర్కొన్నారు. ఈ ఎన్నికలలో యాదవ సామాజికవర్గానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారన్నారు. టీడీపీకి మాత్రం యాదవ కులం అంటే ఒక్క యనమల రామకృష్ణుడి కుటుంబమే కనిపిస్తుందన్నారు. ఇక రాష్ట్రంలో యాదవులు ఎవరూ లేరన్నట్లు.. యనమల రామకృష్ణుడి కుటుంబం ఒక్కటే యాదవ కులం అయినట్లు.. యనమల కుమార్తెకు, ఆయన వియ్యంకుడు సుధాకర్ యాదవ్‌కు, అల్లుడు మహేశ్ యాదవ్‌కు టికెట్లు ఇచ్చారని దుయ్యబట్టారు. మిగిలిన యాదవులందరినీ టీడీపీ అవమానించిందని మండిపడ్డారు. యాదవులు నమ్మితే ప్రాణాలు ఇస్తారని, మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మీ అందరికి అందుబాటులో ఉంటానన్నారు.

డబ్బు అహంకారంతో విర్రవీగుతున్నారు..
: కిలారి వెంకటరోశయ్య

డబ్బులు ఉన్నాయన్న అహంకారంతో టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ విర్రవీగుతున్నాడని గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య పేర్కొన్నారు. బీసీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. చనిపోయిన ప్రతి గొర్రెకు రూ. 6వేలు ఆర్థిక సహాయం అందజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందన్నారు. స్థానికంగా ఉన్న నాయకులను గెలిపించుకుని పార్లమెంట్ నియోజకవర్గ పరిధిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని కోరారు.

బీసీలకు పెద్దపీట : ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జగనన్న ఈ ఎన్నికల్లో మొత్తం లోక్ సభ, అసెంబ్లీ స్థానాలు ఏపీలో 200 ఉండగా.. అందులో 100 సీట్లు బీసీలకే కేటాయించి తన చిత్తశుద్ధి చాటారని పేర్కొన్నారు. బీసీలను బ్యాక్ బోన్ క్లాస్‌గా చేశారని చెప్పారు. డెప్యూటీ సీఎం, స్పీకర్, మంత్రిపదవులు, రాజ్యసభ సభ్యత్వాలు, నామినేటెడ్ పోస్టులు, ఇలా రాజకీయ సాధికారతనూ బీసీలకు సాకారం చేసిన గొప్ప నాయకుడు జగనన్న అని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీల రాజకీయ ఎదుగుదల కోసం అన్ని నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేశామని చెప్పారు. బీసీల పార్టీ వైఎస్సార్‌సీపీ అని... దాన్ని మనం సొంతం చేసుకోవాలన్నారు.

యాదవులకు అత్యంత రాజకీయ ప్రాధాన్యం
: ఎంపీ బీదా మస్తాన్ రావు

రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ తిరుమలలో శ్రీవారి గర్భగుడి తలుపులు సన్నిధి గొల్లలు తెరిచే సంప్రదాయాన్ని పునరుద్ధరించింది జగనన్నే అని చెప్పారు. చనిపోయే ప్రతి గొర్రెకు రూ.6వేలు ఆర్థిక సాయం అందేలా బీమా సదుపాయాన్ని జగనన్న కల్పించారని, దీనివల్ల గొర్రెల కాపరులకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు. ఈ రాష్ట్రంలో యాదవులకు అత్యంత రాజకీయ ప్రాధాన్య కల్పిస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు.

యాదవులంటే నమ్మకం, విశ్వాసం
: మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి

ఏపీలో కాపు, కమ్మ, రెడ్డిలాంటి మూడు అగ్రకులాలకు దీటుగా యాదవ సామాజికవర్గాన్ని కూడా తొలిసారిగా జగనన్న రాజకీయంగా ముందుకు తీసుకొస్తున్నారని మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి వెల్లడించారు. బీసీ ఉప ప్రణాళిక అమలు చేశారన్నారు. శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. యాదవులంటే నమ్మకం, విశ్వాసమని, వారు నమ్మితే ఏదైనా చేస్తారన్నారు. ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ కుల సర్వేని చేపట్టామని చెప్పారు. ఎమ్మెల్యే మద్దాలి గిరి మాట్లాడుతూ బీసీల్లో ఉపకులాలకు 56 కొత్త కార్పొరేషన్లు ఏర్పాటుచేశామన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ నాయకులు నాగార్జున యాదవ్, యాదవ సంఘ ముఖ్య నాయకులు లాకా వెంగళరావు, అంగిరేకుల ఆదిశేషు, రాజాయాదవ్, గోళ్ల శివకుమార్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పకడ్బందీ పోలింగ్ జరిగేలా విధులు నిర్వహణ

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- జిల్లాకు తొమ్మిది మంది శిక్షణ ఐపీఎస్‌ల కేటాయింపు



నగరంపాలెం: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియ జరిగేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. ఎన్నికల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన వివిధ రాష్ట్రాలకు చెందిన తొమ్మిది మంది శిక్షణ ఐపీఎస్ అధికారులతో జిల్లా ఎస్పీ సమావేశమయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై ఆచరించాల్సిన జాగ్రత్తలను వివరించారు. విధి నిర్వహణలో పాటించాల్సిన ఎన్నికల నిబంధనలపై వారికి జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై దృష్టిసారించాలని కోరారు. అనంతరం జిల్లా భౌగోళిక విస్తీర్ణం, సరిహద్దులు, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, పోలింగ్ కేంద్రాలు, చెక్ పోస్టులు, ఇతరత్రా అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో గుంటూరు తూర్పు ఏఎస్పీ నిచికేత్‌షెల్కే, శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ బీజేపీ ఓటమితోనే సాధ్యం



నెహ్రూనగర్: దేశంలో భారతీయ జనాతా పార్టీని ఓడిస్తేనే రాజ్యాంగ విలువలను కాపాడుకోగలుగుతామని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని విముక్తి చిరుతల కక్షి(వీసీకే) పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ తిరుమావళవన్ కోరారు. బుధవారం అరండల్‌పేటలోని వీసీకే పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో ప్రస్తుత ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం కోసం వచ్చినట్లు చెప్పారు. ఏపీలో జరగనున్న ఎన్నికల్లో వీసీకే పార్టీ 9 ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానానికి పోటీ చేస్తుందన్నారు. గుంటూరు పశ్చిమ నుంచి వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌జే విద్యాసాగర్, గుంటూరు ఎంపీ అభ్యర్థిగా చల్లపల్లి రత్నంరాజు, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా కూరపాటి మాణిక్యలరావు పోటీ చేస్తున్నారని వారికి గుంటూరు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. పార్టీ నాయకులు బాలసింగం, వినయ్ పాల్గొన్నారు.

మంచిని అడ్డుకుంటున్న టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీలోకి చేరికల వెల్లువ



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని

పట్నంబజారు: మంచిని అడ్డుకున్న ప్రతి ఒక్కరూ చరిత్ర హీనులుగా మిగలిపోవడం ఖాయమని, వీరికి ప్రజలే బుద్ధి చెబుతారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని హెచ్చరించారు. స్థానిక 24వ డివిజన్‌కు చెందిన 25 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. స్థానిక శ్యామలానగర్ రెండో లైను లోని మంత్రి రజిని నివాసంలో కార్యక్రమం నిర్వహించారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేసే తేదీలు ముందే ప్రకటించి మరీ లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న గొప్ప ప్రభుత్వం తమదని చెప్పారు. చంద్రబాబునాయుడు ఇప్పుడు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలకు ప్రజల్లో ఆగ్రహావేశాలు మరింత పెరుగుతున్నాయన్నారు. అందుకే వైఎస్సార్‌సీపీలోకి చేరికల వెల్లువ కొనసాగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారికి మంత్రి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు మొహ్మద్ అమీర్, జ్యూస్ వలి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి షేక్ సైసా బాబు, షేక్ ఇస్మాయిల్, షేక్ రఫీ, షేక్ నాగుల్‌షరీఫ్, షేక్ సైసా, షేక్ మీర్‌షా, ఇసా జానీ, షేక్ చిన్న సైసా వైఎస్సార్‌సీపీలో చేరారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబంలో సంతోషం

వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటు అభ్యర్థిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ప్రతి కుటుంబంలోనూ సంతోషం నింపాలన్న ఆశయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలన కొనసాగిందని వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 9, 11 డివిజన్‌ల పరిధిలోని చెన్నంవారివీధి, పాతగుంటూరు, ఆనందపేట పరిసరప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి పరిపాలన చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా సంక్షేమ సునామి సృష్టించారన్నారు. మంచి మనస్సుతో ప్రతి ఒక్కరికి మేలు జరగాలని కోరుకున్న జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కూటమి కుట్రలు తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారన్నారు. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే ఎన్నికల కురుక్షేత్రం జరుగనుందని, పేదల పక్షాన పోరుకు సిద్ధపడ్డ జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ ఆబిద్‌బాషా, 9వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి రాచమంటి భాస్కర్, గణేష్, పున్నారావు, గౌస్, బాబు, కుంటా బాబు, బాలా పాల్గొన్నారు.

మరోసారి సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి



ప్రత్తిపాడు మండలం కొత్తమల్లాయపాలెంలో పర్యటిస్తున్న ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య

వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య

ప్రచార పర్వం

కొత్తమల్లాయపాలెం(ప్రత్తిపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని గుంటూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య కోరారు. ప్రత్తిపాడు మండలం కొత్తమల్లాయపాలెం గ్రామంలో బుధవారం కిలారి పర్యటించారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు రోశయ్యకు ఘన స్వాగతం పలికారు. తొలుత పోలేరమ్మ తల్లి ఆలయంతో పాటు స్థానిక రామాలయం, శివాలయం, వెంకటేశ్వర స్వామి, బ్రహ్మం గారి దేవాలయం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను అందుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించిన కిలారి రోశయ్య, వైఎస్సార్ సీపీ హయాంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరింత సంక్షేమం అందాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా గద్దెనెక్కాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా స్థానికులు గుంటూరు చానల్ పొడిగింపు విషయాన్ని కిలారి దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు మంచి చేసే విషయంలో ఎల్లప్పుడూ ముందే ఉంటుందన్నారు. ఇప్పటికే గుంటూరు చానల్ పొడిగింపునకు సంబంధించి పనులు మొదలయ్యాయని, త్వరలోనే ఆ పనులను పూర్తి స్థాయిలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు



లావణ్యకి హారతి ఇస్తున్న మహిళ

మంగళగిరి: సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ చైర్మన్ మండపాటి శేషగిరిరావు పేర్కొన్నారు. నగర పరిధిలోని పెదవడ్లపూడిలో బుధవారం వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్య విజయాన్ని కాంకిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి కేటాయించారని వివరించారు. సమ సమాజం కొరకు కృషి చేస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ అభ్యర్థి అయిన మురుగుడు లావణ్యకు పెత్తందారుడు లోకేష్‌కు మధ్య పోటీలో లావణ్యకు అండగా నిలవాలని కోరారు. అభ్యర్థి మురుగుడు లావణ్య మాట్లాడుతూ సంక్షేమాన్ని అందించాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

తాడికొండలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థుల తరఫున తనయలు బుధవారం ప్రచారం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మేకతోటి సుచరిత, కిలారి రోశయ్య కుమార్తెలు రిషిక, సాయి నవ్యశ్రీ ఫ్యాన్ చూపించి ఓట్లు అభ్యర్థించారు. -తాడికొండ



వైఎస్సార్ సీపీలో కొనసాగుతున్న చేరికలు



పార్టీలో చేరిన వారితో పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీలోకి చేరికలు ఊపందుకున్నాయి. బుధవారం పట్టణంలోని 24వ వార్డుకు చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి అంబటి మురళీకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉందని పార్టీ విజయం కోసం అలుపెరుగని సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ నాజర్, పార్టీలో యాజలి అనిల్‌బాబు, ప్రభాకర్, ఎం.శ్రీనివాస్, పోతురాజు, పి.సతీష్, టి.సాంబయ్య, బి.వెంకటేశ్వర్లు, పి.గోపి, టి.శ్రీకాంత్, సిహెచ్.రవికుమార్, వి.మహేష్, పి.వెంకటేశ్వరరావు చేరారు.

యాదవులకు సముచిత స్థానం కల్పించిన వైఎస్ జగన్

- 8 అసెంబ్లీ, 2 పార్లమెంటు సీట్లతో పాటు ఇద్దరికి రాజ్యసభ సభ్యత్వం
- రెండు సార్లు ఎంపీగా చేసిన జయదేవ్ చేసిన అభివృద్ధి శూన్యం
- ప్రస్తుతం పోటీచేస్తున్న ఎంపీ అభ్యర్థి మళ్లీ అమెరికాకే..
- ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్
- నియోజకవర్గ యాదవుల ఆత్మీయ సమ్మేళనం



సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం దక్కిందని, భవిష్యత్‌లోనూ కొనసాగుతుందని వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి నియోజకవర్గ చంద్రవంశ క్షత్రియ యాదవ రాజుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం రాత్రి స్థానిక నూకల రామకోటేశ్వరరావు కల్యాణ కళాసదనంలో నిర్వహించారు. మాజీ సర్పంచి గంపల శివ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ, యాదవులకు ఎనిమిది అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ స్థానాలు ఇవ్వటంతో పాటు ఇద్దరికి రాజ్యసభ సభ్యులుగా అవకాశం కల్పించినట్లు గుర్తు చేశారు. గతంలో రెండుసార్లు గుంటూరు ఎంపీగా గెలిచిన టీడీపీ పారిశ్రామికవేత్త, గత పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏదీ లేదన్నారు. పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు ఇస్తానని హామీనిచ్చి ప్రజలకు కనిపించిందే లేదని చెప్పారు. మూడుసార్లు ఎంపీగా గెలిచిన మా పెద్దాయన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చేసిన అభివృద్ధి సాక్ష్యాలు ఎన్నో ఉన్నాయని సోదాహరణంగా చెప్పారు. మళ్లీ ఇప్పుడు టీడీపీ అభ్యర్థిగా అమెరికాకు చెందిన సంపన్నుడిని తీసుకొచ్చారని, ఆయన ఆస్తులన్నీ అమెరికాలోనే ఉన్నాయని గుర్తు చేశారు. ఎన్నికలకు రెండు నెలల ముందు వచ్చి డబ్బుందనే అహంకారంతో వైఎస్ జగన్‌నే ఛాలెంజ్ చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల తర్వాత అమెరికాకు వెళ్లిపోతాడని, గత ఎంపీలాగే ఈయనా అందుబాటులో ఉండరని చెబుతూ స్థానికులమైన తమకే అవకాశం ఇవ్వాలని కోరారు.

తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ సామాజిక న్యాయం పాటించిన ఏకైక ఎమ్మెల్యేను తానేనని స్పష్టంచేశారు. అలవికాని హామీలంటూ కూటమి మేనిఫెస్టోపై బీజేపీ, ప్రధాని మోదీ బొమ్మ తీసేయించిందని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు అబద్ధపు హామీలతో ఓట్లను దోచుకోవటానికి వచ్చారని విమర్శించారు. మరోవైపు లాండ్ టైట్లింగ్ చట్టంపైనా కూటమి నేతలు విషప్రచారం చేస్తున్నాయని శివకుమార్ చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మండపాటి శేషగిరిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మాజీ చైర్‌పర్సన్ దొడ్డక సీతామహాలక్ష్మి, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కుర్రా పాములు, వైద్యులు డాక్టర్ తాడిబోయిన అవినాష్, డాక్టర్ అఖిలేష్ తో పాటు చింకా సురేష్‌యాదవ్ మాట్లాడారు. తాడిబోయిన రమేష్, బచ్చనబోయిన శ్రీనివాసరావు, కుర్రా శ్రీను, మల్లెబోయిన రాము, దేశబోయిన నాగపున్నేశ్వరరావు, దానబోయిన సర్వేశ్వరరావు, కుర్రా జస్వంత్, కుక్కల ముక్తేశ్వరరావు, తట్టుకూళ్ల అశోక్‌యాదవ్ వేదికపై ఉన్నారు.

మేనిఫెస్టో అమలు ఘనత వైఎస్ జగన్‌దే



సజ్జల లక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

పెదకాకాని: వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో అమలు ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సతీమణి సజ్జల లక్ష్మి పేర్కొన్నారు. పెదకాకాని మండలం నంబూరులో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి సంక్షేమ ఆంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 4,212 ఓట్లు మెజార్టీ ఇచ్చిన నంబూరు గ్రామ ప్రజలు అంతకన్నా ఎక్కువ మెజారిటీ ఇచ్చి వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని చెప్పారు. మధ్యతరగతి, పేద, నిరుపేద వర్గాల వారి ఆర్థిక ప్రమాణాలు పెంపొందించేందుకు సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వాన్ని బలపరచి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నంబూరులో జరిగిన ఈ ప్రచారానికి ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుస్మితా రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గుజ్జుల సుమతి, గ్రామ సర్పంచి నంబూరు జ్యోతి, ఉప సర్పంచి వుయ్యూరు భవాని, ఎంపీటీసీ సభ్యులు షేక్ లతీఫ్, దాసరి నాగేశ్వరరావు, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ వుయ్యూరు సతీష్‌రెడ్డి, మందాళ శివారెడ్డి, మానవహక్కుల కమిషన్ మాజీ సభ్యుడు గోచిపాతల శ్రీనివాసరావు, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, కొమెర రాజ్యలక్ష్మి, గ్రామ కన్వీనర్ భీమవరపు కృష్ణారెడ్డి, జొన్నల గంగాధరరెడ్డి, సయ్యద్ సుబాని, దాసరి శ్రీకాంత్, బత్తుల ప్రసాద్, లంకపల్లి శ్రీనివాసరావు, అన్నపురెడ్డి రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.